


# కరపత్రం

SINCE 2014

శుక్రవారం ఆగస్ట్ 07, 2026 | సంపుటి : 2 | సంచిక : 296 | - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ | పేజీలు :4

## జయశంకర్ సార్‌కు సిఎం రేవంత్ నివాళి



**హైదరాబాద్,ఆగస్ట్6 :**
ప్రొఫెసర్ జయశంకర్ జయంతి సందర్భంగా జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో ఆయన చిత్రపటానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నివాళు లర్పించారు. సిద్దాంతకర్తగా తెలంగాణ ఉద్యమంలో ప్రొఫెసర్ జయశంకర్ పాత్ర అత్యంత కీలకమైందని అన్నారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం జీవితాంతం అహర్నిశలు శ్రమించిన మహనీయుడని ఆయన కొనియాడారు.ప్రొఫెసర్ జయశంకర్ ఆశయాల సాధనకు ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉంటుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు.

## ఇందిరమ్మ ఇళ్లు పేదలకు వరం

### » గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి



**ఖమ్మం,ఆగస్ట్6 :**
ల్లా ఏదులాపురం మున్సిపాలిటీ గుదిమళ్లలో నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఇందిరమ్మ ప్రభుత్వం పేదల పక్షాన నిలబడుతుందని స్పష్టం చేశారు. ఆగస్టు 15న స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా రాష్ట్రంలో కొత్తగా దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ఆసరా పెన్షన్లు అందజేస్తామని ఆయన కీలక ప్రకటన చేశారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న ప్రభుత్వం, అర్హత కలిగిన ప్రతి లబ్దిదారుడికి నెలకు నిర్ణీత ఆర్థిక సాయాన్ని అందిస్తోంది. ప్రస్తుతం తెలంగాణ ప్రభుత్వ పథకం ద్వారా వృద్ధులు, విధవలు, నేత కార్మికులు, కల్లు గీత కార్మికులు, బీడీ కార్మికులు, ఒంటరి మహిళలు, ఎయిడ్స్ బాధితులకు నెలకు రూ. 2,016 చొప్పున పింఛను అందజేస్తున్నారు. అలాగే దివ్యాంగులకు, తీవ్రమైన శారీరక రుగ్మతలు ఉన్నవారికి నెలకు రూ. 4,016 లభిస్తోంది. అంతేకాకుండా ÷ల్ల÷లేరియా బాధితులకు కూడా ప్రతి నెలా రూ. 2,016 ఆర్థిక సాయం అందుతోంది. సమగ్ర భూ సర్వే చేపట్టి 'భూ భారతి' ద్వారా లబ్దిదారులకు డిజిటల్ మ్యాప్‌తో సహా భూమి హక్కు పత్రాలు అందజేసే బాధ్యతను ప్రభుత్వమే తీసుకుంటుందని మంత్రి హామీ ఇచ్చారు. అనర్హుల వద్ద ఉన్న పాస్ పుస్తకాలను రద్దు చేస్తామని, అర్హులైన పేదలకు ఎట్టి పరిస్థితుల్లోనూ అన్యాయం జరగనివ్వమని స్పష్టం చేశారు. అలాగే రెండు మూడు రోజుల్లోనే ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పక్రియను ప్రారంభిస్తామని పేర్కొన్నాడు. అంతే కాకుండా.. రాబోయే మొదటి పంటకే సాగునీరు అందిస్తామని తెలిపారు. ఇందిరమ్మ రాజ్యం పేదల భరోసా కోసం నిరంతరం శ్రమిస్తుందని ప్రజలు ఎవరూ అధైర్యపడకూడదని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కోరారు.



## సింగరేణి చరిత్రలో మరో మైలురాయి

- నైనీ గనుల నుంచి థర్మల్ విద్యుత్ కేంద్రానికి బొగ్గురాక
- రజైపూర్ వద్ద రైలుకు స్వాగతం పలికిన అధికారులు
- బొగ్గు రాకపై డిప్యూటి సిఎం భట్టి ఆనందం

**మంచిర్యాల,ఆగస్ట్6 :**
సింగరేణి చరిత్రలో మరో మైలురాయి చేరింది. ఒడిశాలోని సింగరేణి నైనీ గని నుంచి తొలి బొగ్గు రైల్వే వ్యాగన్ తెలంగాణకు చేరింది. మంచిర్యాల జిల్లా జైపుర్ సింగరేణి థర్మల్ విద్యుత్తు కేంద్రానికి బొగ్గు రైలు చేరుకుంది. సింగరేణి అధికారులు రైలుకు ఘన స్వాగతం పలికారు. 59 వ్యాగన్ల ద్వారా 4 వేల టన్నుల జీ-10 గ్రేడ్ బొగ్గు వచ్చింది. ఈసందర్భంగా సింగరేణి యాజమాన్యం, కార్మికులకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క శుభాకాంక్షలు తెలిపారు. సింగరేణి చరిత్రలో అద్భుత ఘట్టం ఆవిష్కృతమైందన్నారు.మంచిర్యాల జిల్లా జైపూర్‌లోని సింగరేణి థర్మల్ పవర్ ప్రాజెక్ట్ కి ఒడిశాలోని నైనీ బ్లాక్ నుంచి బొగ్గు చేరుకుంది. ఈ పరిణామపం పట్ల తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క హర్షం వ్యక్తం చేశారు. ఇది చారిత్రాత్మక ఘట్టమని అభివర్ణించారు. గురువారం ఈ థర్మల్ పవర్ ప్రాజెక్ట్‌కు నైనీ బ్లాక్ నుంచి బొగ్గు లోడ్‌తో రైల్వే వ్యాగన్ వచ్చింది. ఈ నేపథ్యంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పందించారు. రాష్ట్రంలో విద్యుత్ లోటు లేకుండా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. సింగరేణి థర్మల్ పవర్ ప్రాజెక్ట్‌కు తమ ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని స్పష్టం చేశారు.
దేశ అవసరాలకూ సింగరేణి బొగ్గు కీలకమని గుర్తు చేశారు. కొత్త కోల్ బ్లాకుల కోసం ప్రయత్నాలు కొనసాగుతాయని తెలిపారు. సింగరేణిని కాపాడుకుంటామని ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చెప్పారు.

మిగతాద్ది 2 లో



## కొత్త తెల్ల రేషన్ కార్డులకు ముహూర్తం ఖరారు

**హైదరాబాద్,ఆగస్ట్6 :**
తెలంగాణలో తెల్లరేషన్ కార్డుల పంపిణీకి ముహూర్తం ఖరారైంది. ఆగస్టు 15 నుంచి కొత్త తెల్ల రేషన్ కార్డుల పంపిణీ చేయనున్నట్లు మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి తెలిపారు.అర్హులైన 1.05 కోట్ల మంది పేదలకు కొత్త రేషన్‌కార్డులు ఇవ్వనున్నట్లు వివరించారు.

2 లో



## అరుణాచల్ ప్రదేశ్‌లో భూప్రకంపనలు

- రిక్టర్ స్కేల్‌పై తీవ్రత **5.1గా నమోదు**

**ఇటానగర్,ఆగస్ట్6 :**
అరుణాచల్‌ప్రదేశ్‌లోని అప్పర్ సియాంగ్ జిల్లాలో గురువారం భూకంపం సంభవించింది.



2 లో

### పదవుల భర్తీలో కాంగ్రెస్

## తీరు సరిగా లేదు

### » పెదవి విరిచిన ఎమ్మెల్సీ కోదండరామ్

**హైదరాబాద్,ఆగస్ట్6 :**
పదవుల భర్తీపై కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరి సరిగా లేదని ఎమ్మెల్సీ కోదండరాం పెదవి విరిచారు. పదవుల భర్తీ ఆలస్యం చేయడం వల్ల కలిగే ప్రయోజనం లేదన్నారు. గురువారం హైదరాబాద్‌లో తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొ. జయశంకర్ సార్ జయంతి సందర్భంగా ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్సీ కోదండరాం మాట్లాడుతూ.. విద్యార్థులు, నిరుద్యోగుల అంశంలో బీఆర్ఎస్ హయాంలో కంటే ఈ ప్రభుత్వంలో స్పందన బాగుందని రేవంత్ రెడ్డి సర్కారును ప్రశంసించారు. ప్రభుత్వంలో తమ భాగస్వామ్యంపై సంప్రదింపులు చేస్తున్నామని వివరించారు.

## గోదావరి ప్రాజెక్టులకు సమాధి

- » ఎపి డైరెక్షన్‌లో నడుస్తున్న జీఆర్ఎంబీ
- » తెలంగాణకు జై అనని రేవంత్ సిఎంగా ఉన్నారు
- » జయశంకర్ ఆరాటం.. కెసిఆర్ పోరటంతోనే తెలంగాణ సాకారం
- » జయశంకర్ జయంతి సందర్భంగా నివాళి అర్పించిన హరీష్ రావు



**సిద్దిపేట,ఆగస్ట్6 :**
కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్ రెడ్డి ఏ రోజూ కూడా జై తెలంగాణ అనలేదని మాజీ మంత్రి హరీశ్ రావు అన్నారు. తెలంగాణ ఉద్యమంలో పాల్గొనని వ్యక్తి ఈరోజు తెలంగాణ సీఎంగా ఉన్నారని విమర్శించారు. సిద్దిపేట ప్రాంతంతో ప్రొఫెసర్ జయశంకర్‌కు ఎంతో అనుబంధం ఉండేదని హరీశ్ రావు అన్నారు. ఆచార్య జయశంకర్ జయంతి సందర్భంగా విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించిన అనంతరం హరీశ్ మీడియాతో మాట్లాడుతూ... తెలంగాణ వచ్చిందంటే కేసీఆర్ పోరాటం, జయశంకర్ సారు ఆరాటం వల్లే అని చెప్పుకొచ్చారు.గోదావరిలో 380 టిఎంసిల నీళ్లు కేసీఆర్ నాయకత్వంలో హక్కుగా సాధించామని గుర్తుచేశారు.

మిగతాద్ది 2 లో



### సచివాలయం ప్రాంగణంలో ఘనంగా

## బోనాల ఉత్సవాలు

- .ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి




**హైదరాబాద్,ఆగస్ట్6 :**
డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో గురువారం సచివాలయ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన బోనాల ఉత్సవాలు అత్యంత వైభవంగా జరిగాయి. ఈ వేడుకల్లో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శ్రీ సంజయ్ జాజు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. సచివాలయ ఆవరణలోని శ్రీ నల్ల పోచమ్మ అమ్మవారి ఆలయంలో నిర్వహించిన పూజల్లో ప్రధాన కార్యదర్శి పాల్గొని రాష్ట్ర ప్రజలు సుఖశాంతులు, ఆయురారోగ్యాలు, సిరిసంపదలతో వర్ధిల్లాలని ప్రార్థించారు.

## తెలంగాణ కోసం కడవరకు తపించిన జయశంకర్ సార్

- .కెసిఆర్ పట్టుదలపై నమ్మకంతో వెన్నంటి వచ్చారు
- .జయంతి సభలో బిఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్



**హైదరాబాద్,ఆగస్ట్6 :**
తెలంగాణ సిద్దాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ సార్ జయంతి సందర్భంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ గురువారం తెలంగాణ భవన్‌లో ఆయన విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. కేసీఆర్‌కు మించి దక్షత,కమిట్‌మెంట్, తెలంగాణ సాధించాలనే మొండితనం ఉన్న నాయకుడిని ఒక్కరిని చూపించండి.. నేను మీ వెంబడి నడుస్తా అని అనేవారని, ఆయన మొహమాటం కూడా పడేది కాదని గుర్తు చేసుకున్నారు.దేవేందర్ గౌడ్ పార్టీ పెడితే వెళ్లి మీరు పోవొద్దు సార్ కేసీఆర్‌తో అసోసియేట్ అయి ఉన్నరని అంటే జయశంకర్ సార్ ఒక మాట చెప్పిండు.. ఎన్ని పార్టీలు వస్తే అంత మంచిది ఏం కాదు.. తెలంగాణ రాష్ట్రం రావాలే..

మిగతాద్ది 2 లో

## నకిలీ ఎన్‌వోసిలపై కొనసాగుతున్న విచారణ

- » మరో 48 కాలేజీల చిట్టాను అందచేసిన హైడ్రా
- » కాలేజీలపై క్రిమినల్ చర్యలు తీసుకునే అవకాశం




**హైదరాబాద్,ఆగస్ట్6 :**
ఇంటర్ కాలేజీల నకిలీ ఫైర్ ఎన్‌ఓసీల వ్యవహారంలో పోలీసుల విచారణ కొనసాగుతోంది. మరో 48 కాలేజీల చిట్టాను హైడ్రా అధికారులు పోలీసులకు అందజేశారు.

## జొన్న రైతులకు శుభవార్త

### రూ. 994 కోట్ల బకాయిలు బ్యాంకు ఖాతాల్లో జమ




**హైదరాబాద్,ఆగస్ట్6**
తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో రాష్ట్ర రైతాంగానికి తీపి కబురు అందించారు. జొన్న పంట కొనుగోళ్లకు సంబంధించి రైతులకు చెల్లించాల్సిన రూ. 994 కోట్లను నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేసినట్లు ప్రకటించారు. తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న ధాన్యం, పంటల కొనుగోలు విధానం వేగవంతంగా, పారదర్శకంగా సాగుతోందని, ఇది మొత్తం దేశానికే ఆదర్శంగా నిలిచిందని ఆయన వ్యాఖ్యానించారు.

# సింగరేణి చరిత్రలో మరో మైలురాయి

మొదటిపేజీ తరువాయి

నైనీ గనుల నుంచి బొగ్గు రాకతో సింగరేణి థర్మల్ పవర్ ప్రాజెక్ట్‌కు ఆ కొరత తీరిందని వివరించారు. సింగరేణి థర్మల్ పవర్ ప్రాజెక్ట్ కి రైలు వ్యాగిన్ చేరుకోగానే.. ఉన్నతాధికారులు స్వాగతం పలికారు. 9 బాక్స్ వ్యాగన్లలో మొత్తం 4,000 టన్నుల జీ–10 రకం బొగ్గు ఒడిశాలోని నైనీ గని నుంచి గురువారం ఉదయం జైపూర్‌కు చేరుకుంది. సింగరేణి కాలరీస్ నుంచి 136 ఏళ్ల చరిత్రలో తొలిసారిగా రాష్ట్రం వెలుపల ఉన్న గని నుంచి బొగ్గు ఉత్పత్తిని సాధించి సొంత థర్మల్ ప్లాంట్‌కు రవాణా చేయడం ఇదే తొలిసారి. ఈ ప్రాజెక్టు విజయవంతం కావడం వెనుక రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క అలుపెరగని కృషి, ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవ ఉన్నాయని ప్రభుత్వం తెలిపింది. అనుమతుల సాధనలో ఎదురైన ఎన్నో అడ్డంకులను పటాపంచలు చేస్తూ ఈ విజయాన్ని సొంతం చేసుకున్నారని పేర్కొంది. అనుమతుల కోసం భట్టి విక్రమార్క స్వయంగా రెండుసార్లు ఒడిశా పర్యటనకు వెళ్లిన విషయం తెలిసిందే. 2024 జులైలో ఒడిశా ముఖ్యమంత్రి, ఉన్నతాధికారులతో సానుకూల వాతావరణంలో చర్చలు జరిపి, ఆటంకాలన్నీ తొలగించారని సర్కార్ స్పష్టం చేసింది. అనంతరం 2025 ఏప్రిల్ 16న నైనీ గనిలో బొగ్గు ఉత్పత్తిని వర్చువల్ విధానంలో డిప్యూటీ సీఎం ప్రారంభించారు. ఆ శ్రమ ఫలితంగా నైనీ గని నుంచి బయలుదేరిన తొలి రైలు 1,131 కిలోమీటర్లు ప్రయాణించి తెలంగాణ గడ్డపైకి చేరుకుంది. 59 బాక్స్ వ్యాగన్ల ద్వారా ఏకంగా 4 వేల టన్నుల అత్యుత్తమ జీ–10 గ్రేడ్ నాణ్యమైన బొగ్గు సింగరేణి థర్మల్ కేంద్రానికి చేరింది. కేంద్ర బొగ్గు శాఖ 2015 ఆగస్టు 13న సింగరేణికి కేటాయించిన ఈ నైనీ గని, మొత్తం 340.78 మిలియన్ టన్నుల బొగ్గు నిల్వల సామర్థ్యాన్ని కలిగి ఉంది. ఈ గని జీవితకాలం 36 సంవత్సరాలు కాగా, ఏడాదికి కోటి టన్నుల (10 మిలియన్ టన్నులు) ఉత్పత్తి సామర్థ్యంతో నడవనుంది. నైనీ నుంచి నాణ్యమైన బొగ్గు రాకతో తెలంగాణ విద్యుత్ ఉత్పత్తిలో ఇకపై ఎలాంటి ఆటంకాలు ఉండవని, భవిష్యత్తు తరాలకు నిరంతర ఉచిత, నాణ్యమైన విద్యుత్ అందించాలన్న ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతుందని స్పష్టమవుతోంది. సింగరేణి కీర్తి కిరీటంలో ఈ నైనీ బొగ్గు గని మరో వజ్రంగా నిలిచిపోనుంది.

## అరుణాచల్ ప్రదేశ్‌లో భూప్రకంపనలు

మొదటిపేజీ తరువాయి

రిక్టర్ స్కేల్‌పై దాని తీవ్రత 5.1గా నమోదయింది. ఈ భూకంపం వల్ల ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం కానీ జరగలేదని నేషనల్ సెంటర్ ఫర్ సీస్మాలజీ వెల్లడించింది. ఈ రోజు తెల్లవారుజాము 5.45 గంటలకు అప్పర సియాంగ్ జిల్లాలోని పాంగిన్‌కు 116 కిలో మీటర్ల దూరంలో.. 11 కిలోమీటర్ల లోతులో ఈ భూకంప కేంద్రాన్ని గుర్తించినట్లు వివరించింది. అయితే ఈ భూకంపానికి ముందు మూడు చిన్న ప్రకంపనలు చోటు చేసుకున్నాయని పేర్కొంది. అవి ఉదయం 3.40 గంటలకు 5 కిలోమీటర్ల లోతులో 2.8 తీవ్రతతో ఒకటి.. దీని తర్వాత 3.55 గంటలకు 3.2 తీవ్రతతో మరొకటి వచ్చిందని వివరించింది. అలాగే ఉదయం 4.34 గంటలకు 2.8 తీవ్రతో ఇంకొకటి వచ్చిందని తెలిపింది. పరిస్థితిని పర్యవేక్షిస్తున్నామని అధికారులు తెలిపారు. రోవైపు ఇదే రాష్ట్రంలోని షి యోమి జిల్లాలో బుధవారం భూకంపం సంభవించింది. ఇది 5.0 తీవ్రతతో వచ్చింది. ఈ జిల్లాకు ఈశాన్యంగా 60 కిలోమీటర్ల దూరంలో భూకంప కేంద్రం నమోదైంది. ఇక్కడ కూడా ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం సంభవించలేదు. దేశంలోని ఈశాన్య ప్రాంతం భూకంపం జోన్‌లో ఉన్న సంగతి తెలిసిందే. ఈ ప్రాంతంలో తరచూ అత్యధికంగా భూ ప్రకంపనలు జరుగుతున్నాయి.

# గోదావరి ప్రాజెక్టులకు సమాధి

మొదటిపేజీ తరువాయి

తెలంగాణ ఉద్యమం ముఖ్యంగా నీళ్ల కోసమే వచ్చిందని గుర్తుచేసిన హరీశ్ రావు, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి మూడేళ్లయినా ప్రాజెక్టులకు సంబంధించి ఒక్క అనుమతి కూడా తీసుకురాలేకపోయిందని దుయ్యబట్టారు. గతంలో 18 సార్లు జీఆర్ఎంబీ సమావేశాలు జరిగినప్పుడు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తెలంగాణ ప్రాజెక్టులను వ్యతిరేకించినా,ఆనాడు తెలంగాణ ప్రభుత్వం వాటిని తిప్పికొట్టి అన్ని అనుమతులు సాధించిందన్నారు. కానీ నేడు చరిత్రలో తొలిసారిగా గతంలో అనుమతులు వచ్చిన ప్రాజెక్టులను కూడా రద్దు చేసి, రివ్యూ చేయాలనే అంశాన్ని జీఆర్ఎంబీ అజెండాలో చేర్చడం శోచనీయమన్నారు. ఈ ప్రభుత్వానికి ప్రాజెక్టులు, నీళ్లపై కనీస సోయి లేదని, ఇప్పటికైనా కళ్లు తెరిచి జీఆర్ఎంబీ అజెండాను మార్పించాలని, ప్రభుత్వం వద్ద చిత్తశుద్ధి ఉంటే ఆ సమావేశాన్ని తక్షణమే బహిష్కరించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 3 సంవత్సరాల్లో ఒక్క ప్రాజెక్ట్‌కు కూడా అనుమతి తీసుకోలేదని మాజీ మంత్రి విమర్శించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్మిస్తున్న బనకచర్ల ప్రాజెక్ట్‌ను తెలంగాణ ప్రభుత్వం ఎందుకు అడ్డుకోలేకపోతోందని ప్రశ్నించారు. సమ్మక్క- సారక్క ప్రాజెక్ట్‌కు హైడ్రాలజీ క్లియరెన్స్ వచ్చాక ప్రభుత్వం ఎందుకు వదులు కుంటుందో ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. ÷ాఖాఖ స్టేజ్ 2కు సమ్మక్క సారక్క నీళ్లు అవసరమన్నారు. గోదావరి బనకచర్ల ప్రాజెక్టును నిర్మించే విషయంలో ఏపీ సర్కార్‌తో తెలంగాణ సర్కార్ లోపాయికారి ఒప్పందం చేసుకుందని హరీశ్ రావు ఆరోపించారు.జయశంకర్ సార్ తన జీవితాన్ని తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పూర్తిగా త్యాగం చేశారని, కేసీఆర్ పోరాటం, జయశంకర్ సార్ ఆరాటం వల్లే తెలంగాణ రాష్ట్రం సిద్ధించిందని హరీశ్ రావు తెలిపారు. తెలంగాణ ఉద్యమంలో ఎప్పుడూ పాల్గొనని, కనీసం 'జై తెలంగాణ' అని అనని వ్యక్తి ఈరోజు రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఉన్నారని రేవంత్ రెడ్డిని ఉద్దేశించి విమర్శించారు. గోదావరి, బనకచర్ల ప్రాజెక్టుల నిర్మాణంలో తెలంగాణ ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో లోపాయికారీ ఒప్పందం చేసుకుందని ఆరోపించారు. మొదట అజెండాలో లేదన్నారని, ఆ తర్వాత ఢిల్లీ మీటింగ్‌లో చేర్చారని, సమావేశానికి హాజరుకామని చెప్పి వెళ్లి సంతకాలు పెట్టారని విమర్శించారు. ప్రభుత్వం కోర్టులలో వేసిన పిటిషన్ల నిర్వహణ రాక అట్టర్ ఎ÷–లాప్ అయిందని, కనీసం రిట్ పిటిషన్ వేయడం కూడా ఈ ప్రభుత్వానికి రావడం లేదని ఎద్దేవా చేశారు.

# తెలంగాణ కోసం కడవరకు తపించిన జయశంకర్ సార్

మొదటిపేజీ తరువాయి

ఆ రాష్ట్రం వచ్చే క్రమంలో నేను వాళ్లకు తెలంగాణ కోసం స్పర్థ లేకుండా, సమాంతరంగా పనిచేయండి.. ఒకరికి ఒకరు కలహించుకోకండి.. ఎవరు చేసిన అల్టిమేట్‌గా మీరందరూ కోరుతున్నది తెలంగాణెళి కదా..చెప్పి వస్తనన్నారు. తెలంగాణ ఉద్యమం సమయంలో ఎన్ని కొత్త పార్టీలు పుట్టినా, వారికి తాత్కాలిక భావసారూప్యత లేకపోయినా, లక్ష్యసారూప్యత ఉండాలని బలంగా వాదించిన గొప్ప వ్యక్తి ప్రొఫెసర్ జయశంకర్ సార్ అని కేటీఆర్ అన్నారు. తెలంగాణలో మళ్లీ నీళ్లకు అన్యాయం చేసే ప్రయత్నం జరుగుతుందని కేటీఆర్ తెలిపారు. తెలంగాణకు సంబంధించిన 7 ప్రాజెక్టులను రద్దు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఏపీ ప్రభుత్వం అడుగుతుంది. ఢిల్లీ పార్టీ చేతుల్లో జుట్టు ఉంటే వాళ్లు ఆడించినట్లే ఆడాలి. అదే తెలంగాణ కోసం పుట్టిన పార్టీ అధికారంలో ఉంటే ఆ పరిస్థితి ఉంటుందా..? అని కేటీఆర్ అడిగారు. లోక్‌సభలో తెలంగాణ విభజనను పాకిస్తాన్‌తో పోలిస్తే ఒక్క బీజేపీ, కాంగ్రెస్ ఎంపీ అయినా మాట్లాడిండా..? అదే మనవాడు ఉంటే గల్లా పట్టి అడిగేవాడని అన్నారు. రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత 75వ సారి ఇవాళ ఆయన ఢిల్లీలో ఉన్నడు. ముఖ్యమంత్రి అయి 32 నెలలు కూడా కాలేదు.. రేపటితోనో, ఎల్లుండితోనో అవుతయి. కానీ 13 రోజులకోసారి ఢిల్లీ పోతడు.. 2,3 రోజులు అక్కడుంటడు. దేహీ దేహీ అని ఈ రోజు అక్కడ యాచిస్తున్నడు. అందుకే జయశంకర్ సార్ ఢిల్లీకి సామంతులుగా ఉండొద్దు.. స్వతంత్రులుగా ఉండాలే అని కోరుకున్నరని అన్నారు. ఎన్నటికైనా స్వీయ రాజకీయ అస్థిత్వమే తెలంగాణకు శ్రీరామ రక్ష. తెలంగాణ కోసం ఒక స్వీయ రాజకీయ అస్థిత్వ పతాక ఉండాలే. ఎన్నటికైనా తెలంగాణ కోసం ఎలాంటి రాజీ లేకుండా ఎవరితో కాంప్రమైజ్ కాకుండా గొంతు విప్పితే ఒక సింహం లాగా గర్జించే విధంగా కేసీఆర్ తీరుగా గొంతు ఉండాలే.. అందుకే కాంగ్రెస్‌లో కలవొద్దు అని గట్టిగా వాదించిన నాయకుడు, మహానుభావుడు ప్రొఫెసర్ జయశంకర్ సార్ అని కేటీఆర్ అన్నారు.

# సచివాలయం ప్రాంగణంలో ఘనంగా బోనాల ఉత్సవాలు

మొదటిపేజీ తరువాయి

ఈ సందర్భంగా సచివాలయ ఉద్యోగులు సంప్రదాయబద్ధంగా బోనాలను సమర్పించగా, పోతరాజుల విన్యాసాలు, డప్పుల వాయిద్యాలు, వివిధ వేషధారణలతో కళాకారుల ప్రదర్శనలు ఉత్సవాలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. పెద్ద సంఖ్యలో ఉద్యోగులు, అధికారులు ఉత్సవాల్లో పాల్గొని భక్తిశ్రద్ధలతో అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రజలకు ప్రధాన కార్యదర్శి శ్రీ సంజయ్ జాజు బోనాల పండుగ శుభాకాంక్షలు తెలియజేస్తూ, అమ్మవారి ఆశీస్సులతో రాష్ట్రంలో సుభిక్షం, శాంతి, అభివృద్ధి నెలకొనాలని ఆకాంక్షించారు.

## నకిలీ ఎన్‌వోసిలపై కొనసాగుతున్న విచారణ

మొదటిపేజీ తరువాయి

విచారణలో భాగంగా ఒకే తరహాలో నకిలీ ఎన్‌ఓసీలు తయారు చేసినట్లు గుర్తించారు. దాదాపు 56 కాలేజీలు నకిలీ ఎన్‌ఓసీలు సమర్పించినట్లు గుర్తించిన హైడ్రా.. మరో 176 కాలేజీలపై విచారణ జరుపుతోంది. ఐదు అంతస్తులలోపు ఉన్న భవనాల అనుమతుల కోసం ఫైర ఎన్‌ఓసీలను హైడ్రా ఇస్తుంది. ఆఫ్‌లైన్‌లో ఎన్‌ఓసీలు మంజూరు చేస్తున్న నేపథ్యంలో కాలేజీ యాజమాన్యాలు అక్రమాలకు పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు. ఎన్‌ఓసీల కోసం హైడ్రాకు దరఖాస్తు చేయకుండానే నకిలీలు సృష్టించి ఇంటర్ బోర్డుకు కాలేజీలు సమర్పించినట్లు విచారణలో వెల్లడైంది. ఒక్కొక్క యూనివర్సిటీకి రూ.6 లక్షల నుంచి రూ.10 లక్షలను కాలేజీ యాజమాన్యాలు ఖర్చుపెట్టినట్లు తెలుస్తోంది. ఎన్‌వోసీల కోసం జీహెచ్‌ఎంసీ, హైడ్రా, ఫైర్ మాజీ డీజీల సంతకాలను ఫోర్జరీ చేసినట్లు గుర్తించారు. ఆయా కళాశాలల యాజమాన్యాలను అదుపులోకి తీసుకుని పూర్తి స్థాయిలో విచారణ జరిపితే అసలు వాస్తవాలు బయటపడతాయని పోలీసులు భావిస్తున్నారు. హైడ్రా నివేదిక, పోలీసుల విచారణలో బయటపడ్డ అంశాలను ఆధారంగా చేసుకుని కాలేజీ యజమాన్యాలపై క్రిమినల్ చర్యలు తీసుకునే అవకాశం ఉన్నట్లు సమాచారం.

## పదవుల భర్తీలో కాంగ్రెస్ తీరు సరిగా లేదు

మొదటిపేజీ తరువాయి

మాకు ఎమ్మెల్సీ, కార్పోరేషన్ చైర్మన్లు ఇస్తామన్నారని గుర్తు చేశారు. గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో పోటీ అంశంపై చర్చిస్తున్నామని చెప్పారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ అంశంపై ప్రభుత్వంతో చర్చిస్తున్నామని పేర్కొన్నారు. గత ప్రభుత్వ వైఖరితో ఈ ప్రభుత్వంపై ఆర్థిక భారం పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ జాతిపిత జయశంకర్ సర్ అని విద్యార్థులే ప్రకటించుకున్నారని ఎమ్మెల్సీ కోదండరాం వివరించారు.

## కొత్త తెల్ల రేషన్ కార్డులకు ముహూర్తం ఖరారు

మొదటిపేజీ తరువాయి

ఆగస్టు 15న సంగారెడ్డిలో సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా రేషన్‌కార్డులు పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని చెప్పారు. అదే రోజున మొత్తం 119 నియోజకవర్గాల్లో ఒకేసారి రేషన్‌కార్డులు పంపిణీ చేస్తామని వెల్లడించారు. అర్హులైన ప్రతి కుటుంబానికి రేషన్ కార్డు అందిస్తామని చెప్పారు.

## జొన్న రైతులకు శుభవార్త

మొదటిపేజీ తరువాయి

అలాగే రాష్ట్రంలో ఎరువుల పంపిణీని మరింత పారదర్శకం చేసేందుకు రూపొందించిన 'తెలంగాణ ఎరువుల యాప్' విజయవంతం కావడంతో, దాని ప్రమాణాల ఆధారంగానే కేంద్ర ప్రభుత్వం 'ఫెర్టిలైజర్ ఫీల్డ్ స్టాఫ్' (ఈఈ÷ూ) వ్యవస్థను అందుబాటులోకి తెచ్చిందని మంత్రి స్పష్టం చేశారు. ఈ నూతన ఎరువుల పంపిణీ విధానాన్ని నేటి నుంచి మరో 10 జిల్లాలకు విస్తరిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో సంప్రదాయ పంటలతో పాటు వాణిజ్య పంటలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యంగా ఆయిల్ పామ్ సాగు విస్తరణపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని, రైతులకు అవసరమైన ప్రోత్సాహకాలు, అవగాహన అందించాలని ఆదేశించారు. తెలంగాణను ఆయిల్ పామ్ ఉత్పత్తిలో అగ్రగామిగా నిలపడమే లక్ష్యంగా ప్రణాళికలు సిద్ధం చేయాలని చెప్పారు. ఇదే సమావేశంలో చేనేత రంగానికి సరికొత్త సాంకేతికతను జోడించేలా నిర్వహించిన హ్యాండ్లూమ్ హ్యాకథాన్ లో విజేతగా నిలిచిన ప్రతిభావంతులను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రత్యేకంగా అభినందించి, ఘనంగా సన్మానించారు. చేనేత కార్మికుల నైపుణ్యానికి సాంకేతికత తోడైతే మార్కెటింగ్ రంగంలో అద్భుతాలు సృష్టించవచ్చని పేర్కొన్నారు. అన్నదాతల సంక్షేమం, వ్యవసాయ రంగం బలోపేతమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని ఈ సందర్భంగా మంత్రి పేర్కొన్నారు.

## దామచెరువు తూము సమస్యపై ఆందోళన వెంటనే పరిష్కరించిన ఇరిగేషన్ అధికారులు

నిజామాబాద్ జిల్లా కోటగిరి మండల కేంద్రంలోని దామరచెరువు తూము షట్టర్ సమస్యను ఇరిగేషన్ అధికారులు ఎట్టకేలకు పరిష్కరించారు. బీఆర్ఎస్ నాయకులు దామరచెరువు దుస్థితిపై ఆందోళన చేపట్టి నిరసన చేపడుతుండడంతో ఇరిగేషన్ అధికారులు తక్షణమే స్పందించారు. ఇరిగేషన్ డిఈ మొహమ్మద్ రఫీ, ఏఈ రవికుమార్ ఆధ్వర్యంలో ఇరిగేషన్ సిబ్బంది, లష్కర్లు చెరువు వద్దకు చేరుకుని తూము షట్టర్ పరిశీలించారు. తూములో కురుకపోయిన షెట్టర్ ను జేసీబీ యంత్రాలతో షట్టర్ బయటకు తీసి పనులు చేపట్టారు. ఎట్టకేలకు ఇరిగేషన్ అధికారులు స్పందించి దామరచర్ల కురుకు పోయిన షట్టర్ పైకి లేపడంతో పాటు ఆయకట్టు రైతులకు సాగునీరు వచ్చేలా ఏర్పాటు చేయడంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు. సుమారు నాలుగు గంటల పాటు జేసీబీ యంత్రాలతో ఇరిగేషన్ అధికారులు ప్రయత్నించి తూము షట్టర్ సమస్యను పరిష్కరించారు. బీఆర్ఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన ఆందోళన కార్యక్రమాలతో ఇరిగేషన్ అధికారులు దిగివచ్చారు . బీఆర్ఎస్ నాయకులకు, ప్రజా ప్రతినిధులకు ఆయకట్టు రైతులు కృతజ్ఞతలు తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో గాయపడి బ్రెయిన్ డెడ్ అవయవాలను దానం చేసిన కుటుంబ సభ్యులు

రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి బ్రెయిన్ డెడ్ కావడంతో అతని అవయవాలు మరో నలుగురికి ప్రాణాధారంగా మారాయి. పెద్ద శంకరంపేటకు చెందిన తోట రవీందర్ మండల పరిధిలోని మల్కాపూర్‌లో ఆర్ఎంపీగా విధులు నిర్వహిస్తూ అందరి మన్నలను పొందాడు. ఈ నెల రెండవ తేదీన ఆదివారం పెద్ద శంకరంపేట పట్టణ శివారులో తోట రవీందర్ రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. గురుపాదుగుట్ట వద్ద అతడు నడుపుతున్న బైకును ఎదురుగా వస్తున్న బైకు ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే అతడిని చికిత్స కోసం హైదరాబాద్‌లోని యశోద ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం తెల్లవారుజామున మృతి చెందాడు. అయితే, అతనికి బ్రెయిన్ డెడ్ కావడంతో బతికే అవకాశం లేదని, అతని అవయవాలు దానం చేస్తే మరికొందరికి నూతన జీవితం లభిస్తుందని జీవన్‌దాన్ ఆర్గాన్ డొనేషన్ నిపుణులు, వైద్యులు అతడి తల్లిదండ్రులకు, కుటుంబ సభ్యులకు వివరించారు. వైద్యుల సూచన మేరకు.. తన కుమారుడు భౌతిక రూపంలో లేకపోయినా మరో రూపంలో జీవించి ఉంటాడని ఆశతో అతడి కుటుంబ సభ్యులు అవయవ దానానికి అంగీకరించారు. వైద్య నిపుణులైన బృందం అతని గుండె, కాలేయం, కిడ్నీలు, నేత్రాలను సేకరించారు. అనంతరం రవీందర్ భౌతిక కాయాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. పెద్ద శంకరంపేటలో గురువారం అతడి అంత్యక్రియలు నిర్వహించారు. రవీందర్ భౌతిక కాయానికి నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి పూలమాల వేసి నివాళులు అర్పించారు. తల్లిదండ్రులకు, కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. రవీందర్ భౌతికకాయాన్ని చూడడానికి పెద్ద శంకరంపేట పట్టణంతోపాటు మల్కాపూర్‌తోపాటు ఇతర గ్రామాల నుంచి అధిక సంఖ్యలో యువకులు, మహిళలు, బంధువులు తరలివచ్చారు.

# డిజిటల్ చెల్లింపులపై ఛార్జీలు బిల్లుకు లోక్‌సభ ఆమోదం

యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ సహా కొన్ని డిజిటల్ చెల్లింపు విధానాలపై ఛార్జీలు విధించే అవకాశాన్ని కల్పించే బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలిపింది. పేమెంట్ అండ్ సెటిల్‌మెంట్ సిస్టమ్స్ యాక్ట్–2007లో సవరణలు చేసే ఈ బిల్లు ద్వారా బ్యాంకులు, చెల్లింపు సేవల సంస్థలకు కొన్ని ఎలక్ట్రానిక్ చెల్లింపు విధానాలపై రుసుములు వసూలు చేసే అవకాశం కల్పించనున్నారు. లోక్‌సభ ఆమోదించిన సవరణ బిల్లు ప్రకారం.. కేంద్ర ప్రభుత్వం నోట్గి÷ చేసే కొన్ని ఎలక్ట్రానిక్ చెల్లింపు విధానాలపై బ్యాంకులు, చెల్లింపు సేవల సంస్థలు ఛార్జీలు వసూలు చేసే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం ఎలక్ట్రానిక్ చెల్లింపులపై మర్చంట్ డిస్కౌంట్ రేట్ వసూలు చేయకుండా ఉన్న నిబంధనలో మార్పులు చేయాలని ప్రభుత్వం ప్రతిపాదించింది. డిజిటల్ చెల్లింపుల వ్యవస్థను నిర్వహిస్తున్న బ్యాంకులు, పేమెంట్ సర్వీస్ ప్రొవైడర్లు, మౌలిక సదుపాయాల సంస్థలకు స్థిరమైన ఆదాయ మార్గాన్ని కల్పించడమే ఈ మార్పుల ఉద్దేశమని ప్రభుత్వం చెబుతోంది. వినియోగదారులు, చిన్న వ్యాపారులపై పెద్ద భారం పడకుండా చిన్న మొత్తంలో రుసుములు విధించే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. లోక్‌సభలో ఈ బిల్లును చర్చ లేకుండానే ఆమోదించారు. ప్రస్తుతం జఖఎ వంటి డిజిటల్ చెల్లింపు విధానాలపై ఎలాంటి ఛార్జీలు లేవు. అయితే ప్రతిపాదిత చట్ట సవరణలతో కేంద్ర ప్రభుత్వం నోటిఫికేషన్ ద్వారా నిర్ణయించే కొన్ని ఎలక్ట్రానిక్ చెల్లింపు విధానాలపై ఛార్జీలు విధించే అవకాశం ఉంటుంది.

## విద్యార్థులతో రాహుల్ సభకు ఆటంకం అనుమతి రద్దుపై మండిపడ్డ రాహుల్

ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో విద్యార్థులతో రాహుల్ గాంధీ నిర్వహించాల్సిన సమావేశానికి అనుమతి రద్దు కావడం వివాదంగా మారింది. ఆగస్టు 8న జరగాల్సిన 'ఛాత్రోంకి గూంజ్' కార్యక్రమానికి రెండు రోజుల ముందే వేదిక అనుమతిని రద్దు చేశారు. ఈ కార్యక్రమం జరగాల్సిన కేపీ గ్రౌండ్ యజమాని అయిన కాయస్థ పాఠశాల ట్రస్ట్.. అలహాబాద్ హైకోర్టు ఆదేశాలను కారణంగా చూపిస్తూ అనుమతిని వెనక్కి తీసుకుంది. 'ఛాత్రోంకి గూంజ్' కార్యక్రమానికి అనుమతి రద్దు చేయడంపై రాహుల్ గాంధీ ఉత్తరప్రదేశ్‌లోని బీజేపీ ప్రభుత్వంపై విమర్శలు చేశారు. తనను అడ్డుకునేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆరోపించారు. అయితే, తనను ఎవరూ ఆపలేరని, విద్యార్థుల సమస్యలపై తన పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. అలహాబాద్ విశ్వవిద్యాలయంలో ఫీజుల పెంపు, సీట్ల తగ్గింపుకు వ్యతిరేకంగా విద్యార్థులు తమ భవిష్యత్తు కోసం పోరాడుతున్నారని రాహుల్ తెలిపారు. వారి సమస్యలను వినకుండా వారిపై కేసులు పెడుతున్నారని ఆరోపించారు. యువత గొంతును అణచివేయడమే ప్రభుత్వ విధానమని, ప్రశ్నిస్తే లాఠీ దెబ్బలు, నిరసన చేస్తే కేసులు, మాట్లాడితే కఠిన చర్యలు తీసుకుంటున్నారని రాహుల్ గాంధీ సోషల్ మీడియా వేదికగా పేర్కొన్నారు. విద్యార్థుల సమస్యలను తెలుసుకోవడానికి తాను ప్రయాగ్‌రాజ్‌కు రావాలని నిర్ణయించుకున్నప్పటి నుంచి తన కార్యక్రమాన్ని అడ్డుకునే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆయన అన్నారు. విద్యార్థుల గొంతుకు ప్రభుత్వం భయపడుతోందని విమర్శించారు. ఎన్ని అడ్డంకులు వచ్చినా విద్యార్థులకు అండగా ఉంటానని రాహుల్ స్పష్టం చేశారు.

# కృష్ణా నీటి వాటాలను తేల్చండి

### – బోర్డు సమావేశం ఏర్పాటు చేయాలని కోరిన ఎపి

కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) ఛైర్మన్‌కు ఏపీ ప్రభుత్వం లేఖ రాసింది. కృష్ణా జలాల అంశంపై చర్చించేందుకు బోర్డు సమావేశం ఏర్పాటు చేయాలని రాష్ట్ర జలవనరులశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కోరారు. శ్రీశైలం, సాగర్‌లో అందుబాటులో ఉన్న నీటిలో ఏపీ, తెలంగాణ వాటాలు ఖరారు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఎల్‌నినో ప్రభావం దృష్ట్యా నీటిని జాగ్రత్తగా వాడుకోవాల్సిన అవసరముందని ఏపీ ప్రభుత్వం అభిప్రాయపడింది. రెండు రాష్ట్రాలకు నీటి కేటాయింపులపై చర్చించి తగిన నిర్ణయం తీసుకోవాలని కోరింది. నీటి వాటాల సింగిల్ పాయింట్ అజెండాతో సమావేశం ఏర్పాటు చేయాలని ప్రతిపాదించింది. బోర్డు లేదా త్రిసభ్య కమిటీ సమావేశం నిర్వహించాలని విజ్ఞప్తి చేసింది.

## నాటిన ప్రతి మొక్కను సంరక్షించాలి బోధన్ మున్సిపల్ చైర్ పర్సన్ తూము పద్మావతి

నాటిన ప్రతీ మొక్కను సరంక్షించాలని బోధన్ మున్సిపల్ చైర్ పర్సన్ తూము పద్మావతి అన్నారు. బోధన్ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఆమె అధికారులు, కౌన్సిలర్లతో కలిసి గురువారం వివిధ రకాల మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కళాశాలకు చెందిన ప్రిన్సిపాల్ అధ్యాపకులు నాటిన మొక్కల సంరక్షణ బాధ్యతలను విద్యార్థులకు అప్పగించాలని అన్నారు. నాటిన మొక్కలు ఏపుగా పెరిగి వాతావరణ కాలుష్యాన్ని నివారించేందుకు దోహదం చేస్తాయని ఆమె అన్నారు. మొక్కలు నాటడం ముఖ్యం కాదని, నాటిన ప్రతీ మొక్క సంరక్షించాలని, ఇందుకు మనమందరం బాధ్యతగా మెదలాలని పద్మావతి అన్నారు. ఈ సందర్భంగా కళాశాల ఆవరణలో సుమారు వందకు పైగా వివిధ రకాల మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జాదవ్ కృష్ణ, కౌన్సిలర్లు తూము శరత్ రెడ్డి, అంకుదామోదర్, గుమ్ముల అశోక్ రెడ్డి నాయకులు పాషా మొయినొద్దీన్, తలారి నవీన్, పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా జయశంకర్ సార్ జయంతి పలు గ్రామాల్లో సార్‌కు నివాళి

ఉమ్మడి జిల్లాలో ప్రొఫెసర్ జయశంకర్ సార్ జయంతి ఉత్సవాలను గురువారం ఘనంగా నిర్వహించారు. బోధన్ పట్టణంలో స్వర్ణకార సంఘం ఆధ్వర్యంలో ప్రొఫెసర్ జయశంకర్ సార్ జయంతి ఉత్సవాలను నిర్వహించారు. స్వర్ణకార సంఘం భవనంలో ఆయన చిత్రపటానికి సంఘం నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా స్వర్ణకార సంఘం రాష్ట్ర కార్యదర్శి మారోజు సుధాకర్ చారి, పట్టణ స్వర్ణకార సంఘం అధ్యక్షుడు హనుమాన్లు చారి మాట్లాడుతూ జయశంకర్ సార్ ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమానికి ప్రధాన సిద్ధాంతకర్త అని గుర్తు చేశారు. తన జీవితాన్ని ప్రాంతీయ హక్కుల పరిరక్షణకు అంకితం చేశారని, కాకతీయ విశ్వవిద్యాలయానికి వైస్ ఛాన్సిలర్‌గా పనిచేసిన గొప్ప విద్యావేత్త అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్వర్ణకార సంఘం నాయకులు పలువురు పాల్గొన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ సార్ ఆశయాలు చిరస్మరణీయమని పిట్లం తహసీల్దార్ మహేందర్ అన్నారు. పిట్లం తహసీల్దార్ కార్యాలయంలో తెలంగాణ సిద్ధాంతకర్త, ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ సార్ జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మార్వో మహేందర్ ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావానికి మేధోబలాన్ని అందించిన మహనీయుడు అని కొనియాడారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలను దేశవ్యాప్తంగా చాటి చెప్పి, ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం జీవితాంతం కృషి చేశారని పేర్కొన్నారు. నిరాడంబర జీవనం, నిజాయితీ, నిబద్ధతతో సమాజానికి ఆదర్శంగా నిలిచిన ఆయన ఆశయాలను ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది పాల్గొని ప్రొఫెసర్ జయశంకర్ సేవలను స్మరించుకుంటూ ఘనంగా నివాళులర్పించారు. బాన్సువాడ డివిజన్ కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర సిద్ధాంత కర్త, ప్రొపెసర్ కొత్తపల్లి
జయశంకర్ సార్ జయంతి వేడుకలను బీఆర్ఎస్, కాంగ్రెస్ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని జయశంకర్ విగ్రహానికి రాష్ట్ర వ్యవసాయ సలహాదారుడు పోచారం, రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాలరాజు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ షేక్ జుబేర్ ఆధ్వర్యంలో ఆయా పార్టీల నాయకులు పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీ ఆర్ ఎస్ పార్టీ నాయకులు మున్సిపల్ కౌన్సిలర్ మక్బూల్, తదితరులు పాల్గొన్నారు.

# సోషల్ మీడియా బండారం బయటపడింది

## డబ్బుకు అమ్ముడుపోయామని ఒప్పుకున్న జుకర్ బర్గ్

**శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్**

- **భారతదేశంలో ఇకపై బంగారు మాయలేడి ఆటలు సాగవు**
- **ఫేస్‌బుక్,ఇన్‌స్టాగ్రామ్ లాంటి సోషల్ మీడియా వేదికలు నడుపుతున్న కంపెనీ పేరు META.**

**మెటా అధినేత మార్క్ జుకర్‌బర్గ్ తమ సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లలో డీప్‌ఫేక్ కంటెంట్ ప్రసారం కావడం మరియు కార్యాచరణ లోపాలు Operational lapses జరగడం తమ వైఫల్యమేనని అంగీకరిస్తూ భారత ప్రభుత్వానికి అధికారికంగా మొన్న ఆగస్టు 5 వ తేదీన క్షమాపణలు తెలిపారు.**

జుకర్‌బర్గ్ వైఫల్యాన్ని ఒప్పుకోవడం ద్వారా ఫేక్ కంటెంట్‌ను ఫిల్టర్ చేయడంలో మరియు అడ్డుకోవడంలో తమ వ్యవస్థలు విఫలమయ్యాయని అంగీకరించినట్లయింది.

**ఒకవేళ డీప్‌ఫేక్ కంటెంట్‌ను అడ్డుకోలేకపోతే, భారత ప్రభుత్వం ఆ ప్లాట్‌ఫారమ్‌ల 'ఇంటర్మీడియరీ' హోదాను రద్దు చేస్తుంది. అదే జరిగితే, ప్లాట్‌ఫారమ్‌లో వచ్చే ప్రతి తప్పుడు పోస్టుకు మెటా సంస్థే చట్టపరంగా బాధ్యత వహించాల్సి వస్తుంది మరియు క్రిమినల్ కేసులను ఎదుర్కోవాల్సి ఉంటుంది.**

సోషల్ మీడియాలలో ఏ విషయాన్నైనా పోస్ట్ చేయడం ఇప్పుడు ఒక ఫ్యాషన్ గా మారింది. ఈ ఫ్యాషన్ దేశానికి పెద్ద ప్రమాదంగా మారింది. సామాజిక మాధ్యమ టెక్నాలజీ తెలియని సామాన్య వినియోగదారులు తమకు చేరిన సమాచారం ప్రకారం స్పందిస్తారు.

- **ఈ బలహీనతను ఆధారం చేసుకొని అమెరికా డీప్ స్టేట్ మరియు దేశ వ్యతిరేక శక్తులు తప్పుడు సమాచారాన్ని విచ్చలవిడిగా ప్రచారం చేస్తున్నారు. టోకుగా ఈ ప్రచారం చేయడానికి మెటా సంస్థ డబ్బులు కూడా తీసుకుంటున్న మాట వాస్తవమని స్వయంగా ఆ సంస్థ అధినేత ప్రకటించడంతో ప్రపంచం ఆశ్చర్యపోయింది.**

**మన చరిత్ర, ప్రస్తుత పరిణామాలపై కృత్రిమ మేధగా పిలువబడే AI టెక్నాలజీతో మనుషుల మనసుల్లో విషాన్ని నింపుతున్న ఈ కుట్రను భారత ప్రభుత్వము చాకచక్యంగా ఛేదించింది.**

**స్వయంగా భారతదేశ ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోడీ గారి వీడియో తొలగించడం తో సామ్రాజ్యవాదశక్తి తోలుబొమ్మ జుకర్ బర్గ్ కుట్రలను తేట తెల్లం చేసింది.**

ఈ మధ్యలో భారత దేశ వ్యతిరేక శక్తులను ఉసిగొల్పడానికి సామాజిక మాధ్యమాలు చేస్తున్న వ్యవహారాలన్నింటిపైన సమగ్ర విశ్లేషణ మరియు సమాచారం కొరకు భారత దేశ పార్లమెంట్ ఒక స్థాయి సంఘాన్ని ఏర్పాటు చేసింది

భారత పార్లమెంటరీ స్థాయి సంఘం Parliamentary Standing Committee on Communications and IT సోషల్ మీడియా సంస్థల నియంత్రణ, వాటి జవాబుదారీతనంపై తీసుకున్న తాజా నిర్ణయాలు మనం తెలుసుకోవాల్సిన అవసరం ఉన్నది.

- **సోషల్ మీడియా వేదికలు కేవలం వినియోగదారులు రూపొందించిన కంటెంట్‌ను ప్రసారం చేసే నిష్పాక్షిక థర్డ్ పార్టీ ఇంటర్మీడియరీలు అంటే మధ్యవర్తులు మాత్రమేనని, వాటి పరిధిని దాటి అల్గారిథమ్‌ల ద్వారా కంటెంట్‌ను ప్రమోట్ చేయడం లేదా నియంత్రించడం చేస్తే వాటికున్న చట్టపరమైన రక్షణను (Safe Harbour Protection) కోల్పోవాల్సి వస్తుందని పార్లమెంటరీ కమిటీ హెచ్చరించింది.**

ఈ వివాదం మరియు పార్లమెంటరీ సంఘం వ్యక్తం చేసిన తీవ్ర అభ్యంతరాలకు సంబంధించిన సమగ్ర వివరాలు.

- **నీట్ (NEET) పరీక్ష పేపర్ లీకేజీలపై కఠిన చర్యలు తీసుకుంటామని హామీ ఇస్తూ జూలై 23న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దేశ యువతను ఉద్దేశించి చేసిన ఒక ఫేస్‌బుక్ వీడియో పోస్ట్‌ను మెటా (Meta) సంస్థ దాదాపు ఐదు గంటల పాటు తాత్కాలికంగా నిలిపివేసింది.**

**సాంకేతిక లోపం సాకు** ..తమ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (AI) ఆధారిత ఆటోమేటెడ్ ఫిల్టర్ల వల్ల జరిగిన పొరపాటుగా మెటా దీనిని పేర్కొంటూ క్షమాపణలు చెప్పినప్పటికీ, భారత ప్రభుత్వం మరియు పార్లమెంటరీ కమిటీ ఈ వివరణను తిరస్కరించాయి. ఇది జాతీయ భద్రత, పబ్లిక్ ఆర్డర్‌కు సంబంధించిన అంశమని స్పష్టం చేశాయి..

- **పార్లమెంటరీ కమిటీ కీలక అభ్యంతరాలు & హెచ్చరికలు..బీజేపీ ఎంపీ నిశికాంత్ దూబే అధ్యక్షతన జరిగిన ఈ కమిటీ సమావేశంలో గూగుల్, మెటా, ఎక్స్ (ట్విట్టర్), స్నాప్‌చాట్ ప్రతినిధులను తీవ్రంగా ప్రశ్నించారు. ఈ సందర్భంగా కమిటీ లేవనెత్తిన ప్రధానాంశాలు.**

- **ఇంటర్మీడియరీ పరిధి దాటడం Algorithm Bias): సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లు తాము కేవలం వినియోగదారుల కంటెంట్‌ను చేరవేసే "మధ్యవర్తులం" అని చెప్పుకుంటూ, అంతర్గతంగా అల్గారిథమ్‌ల ద్వారా కొన్ని రకాల కంటెంట్‌ను యాంప్లిఫై చేయడం అంటే ఎక్కువగా ప్రచారం చేయడం లేదా కొన్ని ప్రముఖ ఖాతాలపై పక్షపాత వైఖరి చూపడం చేస్తున్నాయని కమిటీ తప్పుబట్టింది.**

- **పెయిడ్ ప్రమోషన్లు & అక్రమ కంటెంట్ ద్వారా భారీగా డబ్బులు తీసుకుని నిర్దేశిత వర్గాలను టార్గెట్ చేస్తూ పెయిడ్ ప్రమోషన్ల ద్వారా అక్రమ కంటెంట్‌ను ఈ ప్లాట్‌ఫారమ్‌లు ప్రోత్సహిస్తున్నాయని, తద్వారా ఇవి నిష్పాక్షిక వేదికలుగా మిగలడం లేదని కమిటీ వేలెత్తి చూపింది.**

సెక్షన్ 79 రక్షణ ఉపసంహరణ హెచ్చరిక

- **ఐటీ చట్టంలోని సెక్షన్ 79 ప్రకారం లభించే 'సేఫ్ హార్బర్' (థర్డ్ పార్టీ కంటెంట్‌కు ప్లాట్‌ఫారమ్‌లకు బాధ్యత ఉండదనే మినహాయింపు) రక్షణను తొలగిస్తామని కమిటీ గట్టిగా హెచ్చరించింది.**

- **ఈ రక్షణ కోల్పోతే, సోషల్ మీడియా సంస్థలను కూడా సాధారణ పబ్లిషర్లుగా (ప్రచురణకర్తలు) పరిగణించి, వాటిపై నేరుగా చట్టపరమైన క్రిమినల్ చర్యలు తీసుకునే అవకాశం ఉంటుంది.**

**ప్రధానమంత్రి వీడియో నిలిపివేతపై మెటా సీఈఓ మార్క్ జుకర్‌బర్గ్ వ్యక్తిగతంగా క్షమాపణ చెప్పాలని, ఇందుకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని కమిటీ డిమాండ్ చేసింది. కమిటీ జారీ చేసిన ఆదేశాలతో జుకర్‌బర్గ్ వ్యక్తిగత క్షమాపణలు చెప్పాడు.**

- **దీనిపై స్పందిస్తూ మెటా గ్లోబల్ అఫైర్స్ చీఫ్ జోయల్ కప్లాన్ కేంద్ర ఐటీ మంత్రి అశ్విని వైష్ణవ్‌ను కలిసి సంస్థ తరఫున క్షమాపణలు తెలిపారు.**

- **ఈ మొత్తం అభ్యంతరకర కంటెంట్ తొలగింపునకు మెటా బృందం గడువును కోరింది.**

**పిల్లలపై లైంగిక దురాగతాలకు సంబంధించిన (CSAM) కంటెంట్, డీప్‌ఫేక్స్ మరియు మహిళలను కించపరిచే అభ్యంతరకర కంటెంట్‌ను 3 రోజుల్లోగా పూర్తిగా తొలగించాలని, లేనిపక్షంలో కఠిన చట్టపరమైన చర్యలు ఉంటాయని అల్టిమేటం జారీ చేసింది.**

భారత పార్లమెంటరీ కమిటీ మెటా సంస్థకు స్పష్టమైన సంకేతాన్ని ఇచ్చింది.

**సోషల్ మీడియా సంస్థలు భారతదేశంలో వ్యాపారం చేయాలనుకుంటే ఐటీ రూల్స్, 2021 పరిధిలో కేవలం నిష్పాక్షికమైన 'థర్డ్ పార్టీ మధ్యవర్తులు'గా మాత్రమే వ్యవహరించాలి. తమ స్వంత అల్గారిథమ్‌లతో కంటెంట్‌ను సెన్సార్ చేయడం లేదా నియంత్రించడం వంటి పక్షపాత చర్యలకు దిగితే, పబ్లిషర్ల తరహాలోనే చట్టపరమైన శిక్షలకు అర్హులవుతారు.**

- **బానిస మనస్తత్వం నుండి తేరుకుని స్వాభిమానంతో నిలుచున్న భారతదేశం విదేశీ కుట్రలన్నింటినీ ఒక్కొక్కటిగా తిప్పి కొడుతున్నది.**

- **భారత ఐటీ మంత్రిత్వ శాఖ మరియు పార్లమెంటరీ కమిటీ తీవ్ర నిరసన వ్యక్తం**




**చేసిన నేపథ్యంలో వెలువడిన ఈ క్షమాపణ వెనుక ఉన్న లోతైన అర్థం, రాజకీయ-సాంకేతిక పరిణామాలు ప్రతి భారతీయుడు అర్థం చేసుకోవాలి.**

**ఇప్పటివరకు సోషల్ మీడియా సంస్థలు ఐటీ చట్టంలోని 'సేఫ్ హార్బర్' (Safe Harbour) నిబంధనల వెనుక దాక్కునేవి."వినియోగదారులు అప్‌లోడ్ చేసే కంటెంట్‌తో మాకు సంబంధం లేదు, మేము కేవలం మధ్యవర్తులం మాత్రమే" అని తప్పించుకునేవి.**

- **కానీ, జుకర్‌బర్గ్ వైఫల్యాన్ని ఒప్పుకోవడం ద్వారా కంటెంట్‌ను ఫిల్టర్ చేయడంలో మరియు అడ్డుకోవడంలో తమ వ్యవస్థలు విఫలమయ్యాయని అంగీకరించినట్లయింది.**

**ఒకవేళ డీప్ ఫేక్ కంటెంట్‌ను అడ్డుకోలేకపోతే, భారత ప్రభుత్వం ఆ ప్లాట్‌ఫారమ్‌ల 'ఇంటర్మీడియరీ' హోదాను రద్దు చేస్తుంది.**

- **అదే జరిగితే, ప్లాట్ ఫారమ్‌లో వచ్చే ప్రతి తప్పుడు పోస్టుకు మెటా సంస్థే చట్టపరంగా బాధ్యత వహించాల్సి వస్తుంది మరియు క్రిమినల్ కేసులను ఎదుర్కోవాల్సి ఉంటుంది.**

### అల్గారిథమ్స్ ఆటలు ఇక చెల్లవు

- **డీప్ ఫేక్ కంటెంట్ కేవలం సాధారణంగా వ్యాపించడం లేదు. డబ్బులు చెల్లించి..Paid Promotions ద్వారా నిర్దేశిత వర్గాలను టార్గెట్ చేస్తూ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (AI) అల్గారిథమ్‌ల ద్వారా ఆ కంటెంట్‌ను మెటా ఎక్కువగా ప్రమోట్ చేస్తోందని భారత ప్రభుత్వం నిలదీసింది.**

- **దీనిని Algorithmic Bias అని అంటారు...**

భారత ప్రభుత్వ హెచ్చరికతో ఇది కేవలం సాంకేతిక లోపం అని తప్పించుకోకుండా, మా బిజినెస్ మోడల్ మరియు అల్గారిథమ్స్ తప్పుడు సమాచారాన్ని,నవవజూ ఝునవం ను అరికట్టలేకపోయాయి అని జుకర్‌బర్గ్ ఒప్పుకోవాల్సి వచ్చింది.

**అల్గారిథమిక్ బయాస్ అంటే ఏమిటి?**

సోషల్ మీడియా సంస్థలు ఉపయోగించే కంప్యూటర్ ప్రోగ్రామ్‌లు (Algorithms) మనుషుల లాగే పక్షపాత వైఖరిని ప్రదర్శించడం. Facebook, YouTube, Instagram, X మొదలగు సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లు వినియోగదారులకు ఏ కంటెంట్ చూపించాలి, ఏది దాచాలి అనేది నిర్ణయించడానికి కొన్ని ప్రత్యేక అల్గారిథమ్‌లను వాడుతాయి.

ఈ ప్రక్రియలో కొన్ని రకాల ఆలోచనలకు, కంటెంట్‌కు,కొన్ని పార్టీలకు లేదా గ్రూపులకు ఇవి పక్షపాతంగా మద్దతు ఇవ్వడాన్నే 'అల్గారిథమిక్ బయాస్' అంటారు.

- **ఈ అల్గారిథం ఆధారంగా జెన్ జి పేరుతో యువతరాన్ని విద్యార్థులను జరగగొట్టడానికి కొన్ని దేశ వ్యతిరేక శక్తులు ఈ ప్రక్రియ ను వాడుకుంటున్నాయి.**

- **అల్గారిథం పక్షపాతం వల్ల జరిగే పరిణామాలు ఏమిటి?**

ఎకో ఛాంబర్స్..Echo Chambers

- **మీకు ఒక నిర్దిష్ట రాజకీయ సిద్ధాంతం లేదా నమ్మకం నచ్చితే, అల్గారిథమ్ మీకు నిరంతరం అలాంటి పోస్టులనే చూపిస్తుంది. దీనివల్ల సమాజంలో రెండో వైపు ఉన్న వాస్తవాలు మీకు అస్సలు తెలియవు. మీ ఆలోచనే సరైనదనే భ్రమలో మీరు ఉండిపోతారు.**

ద్వేషపూరిత కంటెంట్ వ్యాప్తి. సమాజంలో విభజన తెచ్చే పోస్టులు, డీప్‌ఫేక్స్, మరియు తప్పుడు సమాచారానికి అల్గారిథమ్‌లు ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వడం వల్ల అవి చాలా వేగంగా వైరల్ అవుతాయి.

**సెన్సార్‌షిప్ మరియు షాడో బ్యానింగ్ కొన్నిసార్లు ఈ అల్గారిథమ్‌లు ఏ తప్పు చేయని ప్రముఖుల లేదా సామాన్యుల ఖాతాలను ..profiles ను ఉద్దేశపూర్వకంగా తక్కువ చేసి చూపిస్తాయి అంటే reach తగ్గిస్తాయి. దీనినే 'షాడో బ్యానింగ్' అంటారు.**

**ఇటీవల భారత ప్రధాని మోదీ వీడియో విషయంలో జరిగింది కూడా ఇలాంటి అల్గారిథమిక్ లోపం అని చెబుతున్న ఒక కుట్ర.**

- **సోషల్ మీడియా సమాచారంపై గుడ్డిగా ఆధారపడకూడదు.**

ఐటీ చట్టం ప్రకారం సోషల్ మీడియా సంస్థలు కేవలం మధ్యవర్తులు..Intermediaries మాత్రమే. అంటే ఒకరు పెట్టిన పోస్టును ఇంకొకరికి చేరవేసే పోస్ట్ ఆఫీస్ లాంటివి. కానీ, ఈ అల్గారిథమిక్ బయాస్ వల్ల అవి నిష్పాక్షికంగా ఉండటం లేదు. తమ అల్గారిథమ్‌ల ద్వారా ఏది వైరల్ అవ్వాలి, ఏది కాకూడదు అనేది స్క్రీన్ వెనుక ఉండి నియంత్రిస్తున్నాయి.

ఇది చట్టవిరుద్ధమని భారత ప్రభుత్వం స్పష్టం చేస్తోంది.

### ఒక సరళమైన ఉదాహరణ

- **మీరు ఒక హోటల్‌కి వెళ్తే మెనూ కార్డ్ నిష్పాక్షికంగా అన్ని వంటకాలను చూపించాలి. కానీ హోటల్ యజమాని తనకు ఎక్కువ లాభం వచ్చే లేదా చెడిపోయిన, కుళ్ళిపోయిన ఆహారాన్ని మాత్రమే మీకు పదే పదే సిఫార్సు recommend చేయడాన్ని అల్గారిథమ్ అంటారు.**

**అది ఎలాగో, సోషల్ మీడియా అల్గారిథమ్‌లు కూడా కొన్ని రకాల కంటెంట్‌ను మాత్రమే మనపై రుద్దడం అల్గారిథమిక్ బయాస్ అవుతుంది.**

- **భారతదేశం సోషల్ మీడియా సంస్థల అల్గారిథమిక్ బయాస్, డీప్ ఫేక్స్ మరియు తప్పుడు సమాచారాన్ని అరికట్టడానికి భారత ప్రభుత్వం ఇటీవలే ఐటీ చట్టం (IT Rules) లో చారిత్రాత్మక సవరణలు చేసింది.**

**ఐటీ చట్టంలోని సెక్షన్ 79 ద్వారా లభించే 'సేఫ్ హార్బర్' (చట్టపరమైన రక్షణ) మినహాయింపును ఈ నూతన నిబంధనలు పూర్తిగా మార్చివేశాయి.**

- **కంటెంట్ తొలగింపు గడువు సమయాన్ని భారీగా తగ్గించింది.**

**సింథటిక్ కంటెంట్ గా పిలువబడే కాంటెంట్ ను,ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (AI) ద్వారా సృష్టించిన ప్రతి కంటెంట్‌పై నియంత్రణ కోసం ప్రత్యేక నిబంధనలు వచ్చాయి.**

**AI లేదా డీప్‌ఫేక్ ద్వారా సృష్టించిన ఇమేజ్‌లు, ఆడియో, వీడియోలపై స్పష్టమైన, శాశ్వతమైన వాటర్‌మార్క్ లేదా లేబెల్ (Label) ఉండాలి. దీనివల్ల చూసే వినియోగదారులకు అది నిజమైనది కాదని సులభంగా అర్థమవుతుంది.**

**అటువంటి డీప్‌ఫేక్ కంటెంట్‌ను మొదట ఎవరు సృష్టించారు మరియు ఎక్కడి నుండి వ్యాపించిందో కనుగొనే సాంకేతిక మెటాడేటా...Metadata వివరాలను ఆయా ప్లాట్‌ఫారమ్ లు భద్రపరచాలి.**

**ప్లాట్‌ఫారమ్‌లు కేవలం కంటెంట్‌ను దాచే వేదికలు కావు.అవి కంటెంట్‌ను రికమండ్ చేస్తున్నందున వాటికి బాధ్యత ఉంటుంది.**

**ప్రతి మూడు నెలలకు ఒకసారి వినియోగదారులకు చట్టపరమైన నిబంధనలు, తప్పుడు సమాచారం వ్యాప్తి చేస్తే జరిగే శిక్షల గురించి సోషల్ మీడియా సంస్థలు నోటిఫికేషన్ల ద్వారా అవగాహన కల్పించాలి.**

### త్వరలో ప్రత్యేక AI చట్టం

- **ప్రస్తుత ఐటీ చట్ట సవరణలతో పాటు, భారతదేశంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ దుర్వినియోగాన్ని, డీప్‌ఫేక్స్ మరియు "డిజిటల్ అరెస్ట్" లాంటి అత్యాధునిక సైబర్ నేరాలను అరికట్టడానికి ప్రత్యేక ఏఐ నియంత్రణ చట్టాన్ని ...Dedicated AI Legislation తీసుకురావడానికి సన్నాహాలు జరుగుతున్నాయి.**

**సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ప్రభుత్వం ఈ చట్ట ముసాయిదాను సిద్ధం చేస్తోంది.**

**ఎండ్-టు-ఎండ్ ఎన్‌క్రిప్షన్**
End-to-End Encryption

- **వాట్సాప్, సిగ్నల్ వంటి యాప్‌లు 'ఎండ్-టు-ఎండ్ ఎన్‌క్రిప్షన్' సాంకేతికతను వాడుతాయి. అంటే మీరు పంపే సందేశాన్ని కేవలం మీరు మరియు అవతలి వ్యక్తి మాత్రమే చదవగలరు. కంపెనీలు లేదా ప్రభుత్వం కూడా దాన్ని చూడలేవు. కానీ ప్రభుత్వ కొత్త నిబంధనలు దీనికి పెద్ద సవాలుగా మారబోతున్నాయి.**

**మొదటి సృష్టికర్త గుర్తింపఇఇు**
Traceability Clause...ఐటీ రూల్స్ ప్రకారం, దేశ భద్రతకు భంగం కలిగించే లేదా తీవ్రమైన నేరాలకు దారితీసే ఒక అక్రమ సందేశాన్ని లేదా ఫేక్ న్యూస్‌ను మొట్టమొదట ఎవరు సృష్టించారు (First Originator) అనేది ప్రభుత్వం అడిగినప్పుడు కంపెనీలు చెప్పాల్సి ఉంటుంది.

**ఎన్‌క్రిప్షన్ పేరుతో తప్పించుకోలేరు**
తమ వ్యక్తిగత లాభాల కొరకు పనిచేసే సామాజిక మాధ్యమాలు ఇకపైన ప్రతి సందేశాన్ని ట్రాక్ చేయాల్సి వస్తుంది.

- **వినియోగదారుల సమాచారం వారి వ్యక్తిగత గోప్యత అని ఈ సంస్థలు తప్పించుకోలేవు. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 19(1) ను సాకుగా చూపి భావవ్యక్తీకరణ స్వేచ్ఛ పేరుతో మన దేశ కోర్టుల కేసులు వేసి తప్పించుకునే అవకాశం లేదు.**

**భారత రాజ్యాంగం లోని ఆర్టికల్ 19 (2) ప్రకారం భావ ప్రకోప స్వేచ్ఛ చెల్లదు.**

**భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 19(2) ప్రకారం వాక్ స్వాతంత్ర్యం మరియు భావ ప్రకటనా స్వేచ్ఛపై రాజ్యాంగం ద్వారా సంక్రమించిన చట్టాలు కొన్ని నిర్దిష్టమైన, 'సహేతుకమైన ఆంక్షలు' ఉన్నాయి.**

భావ ప్రకటనా స్వేచ్ఛ పేరుతో భావ ప్రకోప స్వేచ్ఛ చెల్లదు.

- **భావ ప్రకటన స్వేచ్ఛ సంపూర్ణమైనది కాదు, మరియు దేశ ప్రయోజనాల దృష్ట్యా దీనిని నియంత్రించవచ్చు.**

**అయిన దానికి కాని దానికి డప్పులు చేతబట్టి ఆజాది ఆజాది అంటూ అరిచే జె.ఎన్.యు గ్యాంగుల ఆటలు ఇక సాగవు.**

వేయి సంవత్సరాలు పరాయి పాలనలో అలసిపోయిన భారత జాతి జీవం పుంజుకుంటున్నది.

**ఆత్మ విస్మృతి నుండి భారతీయులు బయట పడుతున్నారు. భారతీయతలోని మధురిమను ప్రజలు ఆస్వాదిస్తున్నారు.**

దేశద్రోహుల ఆటలు ఇకపై సాగవు. సామ్రాజ్యవాద శక్తుల తోలుబొమ్మలైన సోషల్ మీడియా ఆటలు ఇకపై సాగవు.

## భారత్ మాతా కి జై

# గుండ్లపోచంపల్లి లో అక్రమ నిర్మాణం పై ఆగని కేసులు

## జైత్వాలా మహేంద్ర వర్మ పై కేవియట్ పిటిషన్లు

**కరుణాకర్ మల్లిగారి, కరపత్రం ప్రతినిధి**

గుండ్లపోచంపల్లిలో ఇంటి నిర్మాణ పర్మిషన్ లేకుండా మహేంద్ర వర్మ అనే వ్యక్తి అక్రమంగా నిర్మిస్తున్న ఇంటిపై జిహెచ్ఎంసి అధికారులకు పలు ఫిర్యాదులు వెళ్లాయి.

దీని ఆధారంగా జిహెచ్ఎంసి మేడ్చల్ సర్కిల్ ఆఫీస్ నుండి మహేంద్ర వర్మకు తేదీ:30 జూలై 2026 రోజున షోకాజ్ నోటీసులు జారీ అయ్యాయి. జిహెచ్ఎంసి నోటీసులను బేఖాతరు చేస్తూ మహేంద్ర వర్మ ఇంకొక స్లాబ్ వేయడంతో పాటు మళ్ళీ దానిపైన పిల్లర్లు నిర్మించడానికి సన్నాహాలు చేస్తున్నాడు. జిహెచ్ఎంసి నోటీసులో పేర్కొన్న ప్రకారము ఇంటి నిర్మాణ అనుమతులతో కార్యాలయములో సంప్రదించమని చెప్పినప్పటికీ అక్రమంగా నిర్మాణాన్ని కొనసాగిస్తున్నాడు.

ఈ పరిణామాలను గమనించిన ఫిర్యాదుదారు జి. శ్రీనాథ్ కోర్టులో కేసులు ఫైల్ చేశాడు. మహేంద్ర వర్మ అక్రమ దారిలో కోర్టుకు వెళ్లకుండా కేవియట్ పిటీషన్లతో మూడు కోర్టులలో కేసు ఫైలు చేశానని జి. శ్రీనాథ్ కరపత్రం కు తెలియజేశాడు.

**మేడ్చల్ లోని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జ్ గారి కోర్టులో No:2737/26 ద్వారా ఒక కేసు కేవియట్ పిటిషన్**

**మేడ్చల్ లోని ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జ్ గారి కోర్టులో No:2082/26 ద్వారా ఒక కేసు కేవియట్ పిటిషన్**




**మేడ్చల్ లోని రెండవ అడిషనల్ జడ్జ్ గారి కోర్టులో No:3663/26 ద్వారా ఇంకొక కేసు కేవియట్ పిటిషన్**

దాఖలు చేశానని జి శ్రీనాథ్ అన్నాడు.మహేంద్ర వర్మ ఒక లిటిగేషన్ చక్రవర్తిగా గుండ్లపోచంపల్లిలో పేరు పొందాడు. న్యాయంగా భూమి కొన్న వారిపై కేసులు వేసి సతాయించి డబ్బులు దండు కోవడం ఒక వృత్తిగా మార్చుకున్నాడు. ఇతని వల్ల ఎందరెందరో వ్యక్తులు ఇబ్బందులకు గురి అయ్యారు. న్యాయంగా భూమి కొని పని చేసుకునే వారికి సివిల్ కేసుల వల్ల ఇబ్బందులు ఎదురవుతాయి పనులు ఆలస్యం అవుతాయి. ఈ విషయాన్ని గ్రహించిన మహేంద్ర వర్మ భూమి అమ్మిన వారి బంధువులను వెతికి మరి కేసులు వేయిస్తాడు. ఇతనికి భూమితో ఏ సంబంధం లేకున్నా అమాయకులను వెతికి ఆశ చూపి వారితో అక్రమ కేసులు వేయించి తన పబ్బం గడుపుకోవడానికి




మహేంద్ర వర్మ అలవాటు పడ్డాడని జి. శ్రీనాథ్ అన్నాడు. ఈ ఇబ్బందులు తట్టుకోలేని భూమి యజమానులు ఇతనితో కాంప్రమైజ్ చేసుకుని డబ్బులు ఇచ్చి తమ పనులు కొనసాగిస్తున్నారు.కానీ...ఇతని ఆగడాలు ఆగడం లేదని ఎందరో ఇప్పుడు ఎదురు కేసులు వేస్తున్నారు.

ఇతని వల్ల ఇబ్బందులు పడ్డవాళ్ళు, ఇబ్బందులు పడుతున్న వాళ్లు ఎందరెందరో ఇతడు చేస్తున్న అక్రమాల పట్ల ప్రతిఘటన ప్రారంభించారు.

సమాజంలో అశాంతిని అలజడిని రేపే ఇటువంటి వ్యక్తుల పట్ల అందరూ జాగ్రత్తగా ఉండాలి. కేసులకు భయపడకూడదు అని, అందుకే మహేంద్ర వర్మ అక్రమాలు ఒక్కొక్కటిగా బయటకు తీసుకు వస్తానని జి. శ్రీనాథ్ కరపత్రంతో అన్నాడు.

గుండ్ల పోచంపల్లి పట్టణంలోని సర్వే నెంబర్ 210 లో అక్రమంగా మహేంద్ర వర్మ నిర్మిస్తున్న ఇంటిపైన తాను హైకోర్టులో కూడా కేసు ఫైలు చేశానని శ్రీనాథ్ అన్నాడు.

# సింగరేణి గనుల్లోకి అత్యాధునిక సాంకేతికత!

- **అమెరికాలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, అధికారుల బృందం పర్యటన**
- **కొత్త బొగ్గు బ్లాకుల అభివృద్ధి, గనుల్లో భద్రతే లక్ష్యంగా కసరత్తు**
- **కేటర్పిల్లర్, కొమాట్సు కేంద్రాల సందర్శించిన డిప్యూటీ సీఎం, సింగరేణి అధికారులు**

హైదరాబాద్ ఆగస్టు 6 కరపత్రం ప్రతినిధి

తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క నేతృత్వంలో సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ జిమ్కో సీనియర్ అధికారులతో కూడిన ఉన్నత స్థాయి బృందం అమెరికాలో పర్యటిస్తోంది. ఈ పర్యటనలో భాగంగా గురువారం బృందం సభ్యులు టెక్సాస్, అరిజోనా రాష్ట్రాల్లో ఉన్న ప్రఖ్యాత మైనింగ్ యంత్రాల తయారీ కేంద్రాలను సందర్శించారు. అంతర్జాతీయ స్థాయిలో అందుబాటులో ఉన్న ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సింగరేణికి తీసుకురావడం, తద్వారా గనుల్లో భద్రతను మరింత మెరుగుపరచడమే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం, సింగరేణి యాజమాన్యం ఈ పర్యటనకు శ్రీకారం చుట్టాయి.

ముందుగా అరిజోనా రాష్ట్రం టక్సన్‌లోని 'కేటర్పిల్లర్ డెమాన్‌స్ట్రేషన్ అండ్ లెర్నింగ్ సెంటర్'ను ఉప ముఖ్యమంత్రి బృందం సందర్శించింది. అక్కడ స్వయంచాలిత (అటానమస్), రిమోట్ కంట్రోల్ ద్వారా పనిచేసే భారీ మైనింగ్ యంత్రాల పనితీరును ప్రత్యక్షంగా వీక్షించింది. ఓపెన్ కాస్ట్ గనుల్లో ఉపయోగించే భారీ యంత్రాల విడిభాగాలు, ఆపరేటర్ల శిక్షణా విధానాలు, ప్రమాద నివారణ భద్రతా వ్యవస్థల పనితీరు గురించి సాంకేతిక నిపుణులతో అధికారులు లోతైన చర్చలు జరిపారు.



ముఖ్యంగా ప్రమాదకరమైన ప్రాంతాల్లో మ్యాన్యువల్ వర్క్‌ను (మనుషులు నేరుగా పనిచేసే విధానం) తగ్గించేందుకు ఉపయోగపడే 'టెలి-రిమోట్ ఆపరేషన్ టెక్నాలజీ'పై ప్రతినిధి బృందం ప్రత్యేక దృష్టి సారించింది. అనంతరం, టెక్సాస్ రాష్ట్రం డల్లాస్ సమీపంలోని లాంగ్‌వ్యూలో ఉన్న 'కొమాట్సు మైనింగ్ కార్పొరేషన్' ఫెసిలిటీని కూడా ఉన్నత స్థాయి బృందం సందర్శించింది. అక్కడ భారీ మైనింగ్ యంత్రాల తయారీ, అసెంబ్లీ ప్రక్రియలను క్షుణ్ణంగా పరిశీలించింది. సింగరేణిలో యంత్రాల నిర్వహణ (మెయింటెనెన్స్) ఖర్చులు, డౌన్ టైమ్ తగ్గించడమే లక్ష్యంగా భవిష్యత్తులో సాంకేతిక సహకారం, విడిభాగాల (స్పేర్ పార్ట్స్) లభ్యత, పరికరాల సరఫరా ఒప్పందాల తదితర అంశాలపై సంస్థ ప్రతినిధులతో చర్చలు సాగించారు.

ఆధునిక, స్వయంచాలిత యంత్రాలను వాడటం ద్వారా ఓపెన్‌కాస్ట్ గనుల్లో కార్మికుల భద్రతను గణనీయంగా పెంచడంతో పాటు ప్రమాదాల రేటును భారీగా తగ్గించవచ్చని అధికారులు భావిస్తున్నారు. ప్రపంచస్థాయి తయారీదారులతో నేరుగా చర్చలు జరపడం వల్ల యంత్రాల కొనుగోలులో మెరుగైన నిబంధనలు, వేగవంతమైన సర్వీసు, స్థానికంగా నిర్వహణ కేంద్రాల ఏర్పాటుకు అవకాశాలు మెరుగుపడతాయి. సాంకేతిక బదిలీ ఒప్పందాల ద్వారా భవిష్యత్తులో తెలంగాణలోనే సర్వీస్ యూనిట్లు ఏర్పాటయ్యే అవకాశం ఉంది. దీనిద్వారా సింగరేణి సిబ్బందికి నైపుణ్యాభివృద్ధి శిక్షణ లభించడంతో పాటు సంస్థ నిర్దేశించుకున్న దీర్ఘకాలిక 'కోల్-టు-క్లీన్-ఎనర్జీ' పరివర్తన లక్ష్యాలతో అనుసంధానం అయ్యేలా ఈ పర్యటన దోహదపడుతుంది.

సింగరేణి సంస్థ ఇటీవల కొత్తగా రెండు భారీ బొగ్గు బ్లాకులను దక్కించుకున్న నేపథ్యంలో తాజా అమెరికా పర్యటన అత్యంత ప్రాధాన్యం సంతరించుకుంది. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని 'తాడిచెర్ల ఓపెన్ కాస్ట్-2' బ్లాక్ నామినేషన్ పద్ధతిలో సింగరేణికి కేటాయించబడగా.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు పరిధిలోని 'పీకేఓసీ-2 డిప్-సైడ్' బ్లాక్‌ను వేలం ద్వారా దక్కించుకుంది. తాడిచెర్ల బ్లాక్‌లో సుమారు 182 మిలియన్ టన్నుల బొగ్గు నిల్వలు, 40-50 ఏళ్ల జీవిత కాలం ఉండగా.. పీకేఓసీ-2 బ్లాక్‌లో 180 మిలియన్ టన్నుల నిల్వలు, 25 ఏళ్ల జీవిత కాలం ఉంది. ఈ రెండు బ్లాకుల ద్వారా మొత్తం 360 మిలియన్ టన్నులకు పైగా అదనపు నిల్వలు సింగరేణి పోర్ట్‌ఫోలియోలో చేరాయి. సింగరేణి నిర్దేశించుకున్న వార్షిక 100 మిలియన్ టన్నుల ఉత్పత్తి లక్ష్యానికి ఈ బ్లాకులు కీలకం కానున్నాయి. ఫలితంగా రాబోయే రోజుల్లో ఈ భారీ ఓపెన్ కాస్ట్ ప్రాజెక్టులకు పెద్ద ఎత్తున షావెల్స్, డంపర్లు, డ్రాగ్ లైన్లు, డ్రిల్లింగ్ సిస్టమ్స్ వంటి భారీ యంత్రాల అవసరం ఏర్పడనుంది. కేటర్పిల్లర్, కొమాట్సు వంటి అంతర్జాతీయ సంస్థల టెక్నాలజీని ముందుగానే అంచనా వేయడం ద్వారా, కొత్త ప్రాజెక్టులు ప్రారంభం కావడానికి ముందే యంత్రాల కొనుగోలు, ఫ్లీట్ విస్తరణ, ఆటోమేషన్ ప్రణాళికలను సింగరేణి సిద్ధం చేసుకోగలుగుతుందని అధికారులు స్పష్టం చేస్తున్నారు.

ఈ కార్యక్రమంలో సింగరేణి సీఎండీ డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి, డిప్యూటీ సీఎం సెక్రటరీ కృష్ణ భాస్కర్, క్యాటర్‌పిల్లర్ ఇండియా ప్రతినిధి ఆర్ కె మిశ్రా, డెన్నిస్ తదితరులు పాల్గొన్నారు.

# జిహెచ్ఎంసి కమిషనర్ శ్రీ ఆర్.వి. కర్ణన్, ఈరోజు జిహెచ్ఎంసి కమాండ్ కంట్రోల్ జనన మరణాల నమోదుపై సమీక్షా సమావేశం

హైదరాబాద్ ఆగస్టు 6 కరపత్రం ప్రతినిధి

సెంటర్‌లో కీటక శాస్త్ర కార్యకలాపాలు, వాహక వ్యాధుల సంసిద్ధత, జనన మరణాల నమోదుపై సమీక్షా సమావేశానికి అధ్యక్షత వహించారు. దీనితో పాటు, రాబోయే సివిల్ రిజిస్ట్రేషన్ సిస్టమ్ (సిఆర్ఎస్) పోర్టల్‌పై అవగాహన కార్యక్రమాన్ని కూడా నిర్వహించారు.

జనన మరణాలను సకాలంలో నమోదు చేయడం, ధృవీకరణ పత్రాలను వెంటనే జారీ చేయడం జిహెచ్ఎంసి యొక్క కీలక చట్టబద్ధమైన బాధ్యత అని కమిషనర్ నొక్కి చెప్పారు. ఈ సమావేశంలో వాహక వ్యాధుల నివారణ చర్యల స్థితిని సమీక్షించారు. ఇందులో భాగంగా అడల్టిసైడ్లు లార్విసైడ్ల వినియోగాన్ని 100%గా నిర్ధారించడం, నిఘా మరియు వ్యాధి మూలాల తగ్గింపు కార్యకలాపాలను ముమ్మరం చేయడం, పాజిటివ్ కేసుల చుట్టూ చర్యలను బలోపేతం చేయడం, మరియు 7 ఆగస్టు 2026 నుండి అన్ని జిహెచ్ఎంసి సర్కిళ్లలో ప్రత్యేక శుక్రవార డ్రై డే డ్రైవ్‌లను నిర్వహించడం వంటి ఆదేశాలు జారీ చేశారు. అన్నపూర్ణ క్యాంటీన్ల పర్యవేక్షణను పెంచాలని సహాయ వైద్య ఆరోగ్య అధికారులకు కూడా సూచించారు.

ప్రధాన వైద్య ఆరోగ్య అధికారి సర్కిళ్ల వారీగా డెంగ్యూ కేసులు, కాలానుగుణ సంసిద్ధత, దోమల ప్రవర్తన మరియు వ్యాప్తి నివారణ చర్యలను సమీక్షించారు. మెట్రోపాలిటన్ సర్వైలెన్స్ యూనిట్ (మీఖ) వ్యాధి నిఘా, హాట్‌స్పాట్ మ్యాపింగ్ మరియు సమన్వయ క్షేత్రస్థాయి చర్యలపై తాజా




సమాచారాన్ని అందించింది. అదనపు కమిషనర్ (ఐటీ) జనన మరణాల నమోదు (=దీణ) చట్టం మరియు రాబోయే సివిల్ రిజిస్ట్రేషన్ సిస్టమ్ (జ=ూ) పోర్టల్ గురించి అధికారులకు వివరించారు. ఈ పోర్టల్ సరళమైన మరియు పౌర-స్నేహపూర్వక డిజిటల్ వేదిక ద్వారా పౌరులు తమ జనన మరణాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవడానికి వీలు కల్పిస్తుంది.

ఈ సమావేశానికి అదనపు కమిషనర్ (ఆరోగ్యం) బి. సంతోష్ నాయక్; అదనపు కమిషనర్ (ఐటీ) ఉదయ్ పోగరి; జాయింట్ కమిషనర్ (ఐటీ) రాధ; రాష్ట్ర జనన మరణాల జాయింట్ డైరెక్టర్ అన్నప్రసన్న కుమారి; చీఫ్ మెడికల్ ఆఫీసర్ ఆఫ్ హెల్త్ (జమీాం) డా. అమర్ సింగ్ నాయక్; 30 జీహెచ్ఎంసీ సర్కిళ్ల నుండి అసిస్టెంట్ మెడికల్ ఆఫీసర్స్ ఆఫ్ హెల్త్ (ూమీాంం); మెట్రోపాలిటన్ సర్వైలెన్స్ యూనిట్ (మీఖ) బృందం; సీనియర్ ఎంటమాలజిస్టులు; సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ (జ++) బృందం హాజరయ్యారు.

## 20 నెలల్లో 150 జీసీసీలు.. 1.5 లక్షల ఉద్యోగాలు

**జేఎల్ఎల్ జీసీసీ ప్రారంభించిన మంత్రి శ్రీధర్ బాబు**



హైదరాబాద్ ఆగస్టు 6 కరపత్రం ప్రతినిధి

గత 20 నెలల కాలంలో తెలంగాణలో కొత్తగా ఏర్పాటైన 150 గ్లోబల్ కెపబిలిటీ సెంటర్ల (జీసీసీలు) ద్వారా 1.5 లక్షల మందికి ఉపాధి లభించిందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వెల్లడించారు. ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో జేఎల్ఎల్ సంస్థ ఏర్పాటు చేసిన గ్లోబల్ కెపబిలిటీ సెంటర్‌ను గురువారం నాడు ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రపంచవ్యాప్తంగా పెట్టుబడులకు అనువైన ప్రాంతాలను గుర్తించి సిఫారసు చేసే సంస్థగా జేఎల్ఎల్‌కు ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. అలాంటి సంస్థ హైదరాబాద్‌ను తన జీసీసీ కేంద్రంగా ఎంచుకోవడం తెలంగాణ సామర్థ్యానికి నిదర్శనమని పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా సంప్రదాయ ఐటీ కార్యకలాపాలు మార్పులకు లోనవుతున్న తరుణంలో, ఇన్నోవేషన్ ఆధారిత జీసీసీలు భవిష్యత్ ఉపాధికి ప్రధాన కేంద్రాలుగా అవతరిస్తున్నాయని చెప్పారు. కృత్రిమ మేధ (ఏఐ), ఆటోమేషన్ ప్రభావంతో సాంకేతిక రంగంలో మార్పులు వచ్చినా, జీసీసీల ప్రాధాన్యం ఏమాత్రం తగ్గలేదని స్పష్టం చేశారు.

తెలంగాణలో జీసీసీల వేగవంతమైన విస్తరణకు అత్యుత్తమ మౌలిక వసతులు, నైపుణ్యం కలిగిన మానవ వనరులు, పరిశ్రమలకు అనుకూలమైన ప్రభుత్వ విధానాలు ప్రధాన కారణాలన్నారు. హైదరాబాద్ నగర అభివృద్ధిలో ఔటర్ రింగ్ రోడ్ ఎంత కీలక పాత్ర పోషించిందో, ఇప్పుడు రీజినల్ రింగ్ రోడ్, ఏఐ సిటీ, భారత్ ఫ్యూచర్ సిటీ వంటి ప్రాజెక్టులు భవిష్యత్ పెట్టుబడులకు బలమైన పునాది వేస్తున్నాయని చెప్పారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు చేపడుతూ, ఏఐ, డీప్‌టెక్, అధునాతన సాంకేతిక రంగాలకు అవసరమైన మానవ వనరులను రాష్ట్రం సిద్ధం చేస్తోందన్నారు.

### హైదరాబాద్‌కు 16% జాతీయ వాటా

2024 నుంచి 2026 మధ్య దేశవ్యాప్తంగా జీసీసీల కార్యాలయ లీజింగ్‌లో హైదరాబాద్ వాటా 16 శాతంగా నమోదైందని మంత్రి తెలిపారు. అదే సమయంలో నగరంలో జరిగిన మొత్తం కార్యాలయ లీజింగ్‌లో జీసీసీల వాటా 42 శాతానికి చేరుకోవడం హైదరాబాద్ ఆర్థిక వ్యవస్థలో వాటికి పెరుగుతున్న ప్రాధాన్యాన్ని ప్రతిబింబిస్తోందన్నారు. ఆరోగ్య సంరక్షణ, బయోటెక్నాలజీ, సెమీకండక్టర్ రంగాలకు చెందిన జీసీసీల ఏర్పాటులోనూ హైదరాబాద్ తొలి ఎంపికగా నిలుస్తోందని పేర్కొన్నారు. దీంతో ఐటీ కేంద్రంగా మాత్రమే కాకుండా, అత్యాధునిక సాంకేతిక రంగాల్లోనూ ప్రపంచ స్థాయి ఆవిష్కరణలకు వేదికగా నగరం ఎదుగుతోందన్నారు.

### 1,600 మందికి ఉద్యోగాలు

జేఎల్ఎల్ ఏర్పాటు చేసిన గ్లోబల్ కెపబిలిటీ సెంటర్ పూర్తిస్థాయిలో కార్యకలాపాలు ప్రారంభిస్తే వచ్చే రెండేళ్లలో సుమారు 1,600 మందికి ఉపాధి లభించనుంది. ఫైనాన్స్, మానవ వనరులు, ప్రాజెక్టు నిర్వహణ, లీజ్ అడ్మినిస్ట్రేషన్, అడ్వాన్స్‌డ్ అనలిటిక్స్, టెక్నాలజీ ఆధారిత సేవలను ప్రపంచవ్యాప్తంగా జేఎల్ఎల్ కార్యకలాపాలకు ఈ కేంద్రం సేవలను అందిస్తుంది.

కార్యక్రమంలో జేఎల్ఎల్ ఇండియా సీఈఓ రాధా ధిర్, హైదరాబాద్ సీనియర్ మేనేజింగ్ డైరెక్టర్ సందీప్ పట్నాయక్, గ్లోబల్ సర్వీస్ సెంటర్ హెడ్ ధీరజ్ పోప్లీ, ఐటీ శాఖ సలహాదారు సాయి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ప్రొఫసర్ జయశంకర్ కి నివాళులు అర్పించిన హెచ్ఎంఆర్ఎల్ జేఎండీ శివేంద్ర ప్రతాప్

హైదరాబాద్ ఆగస్టు 6 కరపత్రం ప్రతినిధి

తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫసర్ కొత్తపల్లి జయశంకర్ జయంతి సందర్భంగా నేడు హైదరాబాద్ మెట్రో రైల్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ శివేంద్ర ప్రతాప్ ఆయనకు ఘన నివాళులు అర్పించారు. మెట్రో రైల్ భవన్ లో జరిగిన కార్యక్రమంలో ఆయన ప్రొఫసర్ జయశంకర్ చిత్ర పటానికి పుష్పాంజలి ఘటించారు.



జయశంకర్ నిస్వార్థ సేవలను, తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు ఆయన చేసిన అవిశ్రాంత పోరాటాన్ని శ్లాఘించారు. ఆయన ఆశయాల సాధనకు అందరూ కృషిచేయాలని, ఆయన కలలను సాకారం చేయాలని శివేంద్ర ప్రతాప్ పిలుపునిచ్చారు. హెచ్ఎంఆర్ఎల్ అధికారులు, సిబ్బంది ప్రొఫసర్ జయశంకర్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు.

## సమస్యల పరిష్కారానికి నిధులు ఇవ్వండి :

**బండి రమేష్**

కూకట్పల్లి ఆగస్టు 6 కరపత్రం ప్రతినిధి



కూకట్పల్లి నియోజకవర్గం లోని పలు సమస్యలు,అభివృద్ధి పనులపై సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ సృజన గారిని కలిసి వినతిపత్రం అందించిన కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్,పూజజ ఉపాధ్యక్షులు బండి రమేష్ చాలాకాలంగా మూసాపేట్ వై జంక్షన్ ఫ్లైఓవర్ సమస్యలున్నాయని,మూసాపేట్ రోడ్ వైండింగ్,లేక్ వ్యూ,బాలానగర్ నాలాలు,సిల్ట్ పనులు పెండింగ్ లో ఉన్నాయని కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు,చాలా కాలనీల్లో రోడ్లు పాడైపోయి ప్రజలకు ఇబ్బందులు కలుగుతున్న విషయం పరిశీలనలో తేలిందని, పార్కుల అభివృద్ధిపై కూడా దృష్టి పెట్టి తగిన నిధులు మంజూరు చేసి,పనులు వేగవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. రమేష్ గారి విన్నపంపై సానుకూలంగా స్పందించిన కమిషనర్ సృజన గారు , వీలైనంత త్వరలో నిధులు కేటాయించి పనులు పూర్తి చేయటానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.